
పరిస్థితుల పేరుతో ప్రేమను మోసం చెయ్యాలని చూస్తే—నువ్వే మోసపోతావు. ఎందుకంటే, ఎదుటివారికీ పరిస్థితులుంటాయి! ఎదురు తిరుగుతుంది ప్రేమ!

# ఎదురు తిరిగిన ప్రేమ

మునీర్



రివ్వున లేచి పరుగులు తీసి భళ్ళున పగిలి ల్లావెగిరై నురగలు కక్కుతున్నాయి కెరటాలు. మంద్రంగా వీస్తోంది చల్లగాలి. దూరంగా ఎత్తుగా వినీలాకాశంలో పల్టీలు కొట్టున్నాయి పక్షులు. దూది పింజల్లా ఎగిరిపోతున్నాయి తెల్లటి పిల్లమేఘాలు. సాయంకాలపు సీరెండ సముద్రంపైపడి వింతగా మెరిసిపోతోంది. పగలల్లా పనిచేసి అలసిపోయిన పడవలొక్కొక్కటే తీరానికి చేరుకుంటున్నాయి. దూరంగా హార్బర్‌లో దేవుడు తయారుచేసి వదిలిన కాగితపు పడవల్లా బొమ్మరిళ్ళలా తేలుతున్నాయి స్టీమర్లు.

వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

జంటలు జంటలుగా.

గుంపులు గుంపులుగా.

జట్లు జట్లుగా - కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు జనం బీచ్‌లో.

వేగంగా ముందుకు వస్తూ. అదే వేగంతో మళ్ళీ వెనక్కు వెళ్ళిపోతున్న కెరటాల తాలూకు నురుగును చూస్తూ కేరింతాలు కొడుతున్నారు చిన్నపిల్లలు.

శనక్కాయలు, ఇస్‌క్రీం వగైరావగైరా అమ్మేవాళ్ళ కేకలతో హడావుడిగా వుంది బీచ్.

బోర విరుచుకుని సముద్రంకేసి ధైర్యంగా చూస్తోంది హైకోర్టు.

సముద్రపు హోరు.

తినుబండారాలు అమ్మేవాళ్ళ హోరు.

పిల్లల కేరింతల జోరు.

ఆ హోరులో.

ఆ జోరులో.

దూరంగా కూర్చుని—

"అయితే నీ నిర్ణయం మార్చుకోనంటావా?"

సరోజ కళ్ళలోకి సూటిగా చూడాలని ప్రయత్నిస్తూ అడిగాడు రామం. అతని ముఖం పాలిపోయివుంది.

సరోజ మౌనంగా ఇసుకలో గీతలు గీస్తూ వుండిపోయింది.

క్షణాలు చకచకా దొర్లిపోయాయి.

రామం చేతిలోని ఫైలుమీద.

సరోజ ఇసుకలో - గీతలు గీస్తూ వుండిపోయారు.

"ఐస్‌క్రీం సార్" అరుచుకుంటూ వచ్చాడో కుర్రాడు.

ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు ఎవరి ఆలోచనల్లో వారున్నారు.

ఐస్‌క్రీం కుర్రాడు వెళ్ళిపోయాడు.

"నాకు తెలుసు నువ్వు బాధపడావని.. కాని ఈ విషయం నీతో చెప్పటానికి ముందు నేనెంత బాధపడి వుంటానోకూడా వూహించు" సరోజ అంది నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ.

"ప్రేమ ప్రదర్శించు కావనను. ప్రేమ త్యాగాన్ని కోరదు. ప్రేమ ప్రేమను కోరుతుంది" సరోజ చెప్పబోయింది.

"సినిమా డైలాగులు అనవసరం" విసురుగా అన్నాడు రామం. "నేనో ఉద్యోగం. సద్యోగం లేని బడుద్ధాయినని. పెళ్ళాన్ని పోషించుకోవటం చేతకాని వాణ్ణని బియ్యే వెలగబెట్టి రెండేళ్ళవుతున్నా వుద్యోగం లేకుండా ఆవారాగా తిరుగుతున్నాననేగా నేనంటే నీకీ అలుసు...."

రామం చెప్పబోయాడు ఆవేశంగా.

"వేడి వేడి శనక్కాయలు సార్. వేడి వేడి శనక్కా.." అరుచుకుంటూ వచ్చాడో కుర్రాడు.

"గెటౌట్" కోపంగా అరిచాడు రామం.

బిక్క మొహం వేసుకుని వెళ్ళిపోయాడా కుర్రాడు.

"అరుపులవల్ల పనులు కావు" సరోజ అంది సౌమ్యంగానే.

"అరుస్తాను గెంతుతాను. గుడ్డలు చించుకుని మరీ గెంతుతాను నువ్వెవరివి నన్నడగటానికి" రామానికి క్షణక్షణానికీ వివేచనాజ్ఞానం సన్నగిల్లుతోంది.

"డోంట్ బి సిల్లీ రామం" సరోజ ముఖం ఎర్రబడింది. "పరిస్థితుల నర్థం చేసుకోటానికి ప్రయత్నించు. నువ్విలాగే అరిచావంటే నేను వెళ్ళిపోతాను" లేవటానికుద్యుక్తురాలవుతూ అంది సరోజ.

చటుక్కున చెయ్యి పట్టుకున్నాడు రామం. "ప్లీజ్ కూర్చో ప్లీజ్ - ఏమిటో వాగేశాను ఆవేశంలో. ప్లీజ్ ఏమనుకోక" అన్నాడు.

సరోజ కూర్చుంది. కొద్ది క్షణాలసేపు మౌనం రాజ్యమేలింది.

వెలుగు స్థానంలోనే చీకట్లు క్రమక్రమంగా కమ్ముకుంటున్నాయి. స్తీమర్లలో లైట్లు వెలిగాయి. పున్నమి చంద్రుడు కాబోలు షోగ్గా అలంకరించుకుని మెల్ల మెల్లగా పైకి వస్తున్నాడు. ఒకటొకటిగా వెలగటం మొదలెట్టాయి సిటీలోని లైట్లు. రొద చేసుకుంటూ నెత్తిమీదుగా ఎగిరిపోతోందో విమానం - లైట్లార్పుకుంటూ, వెలిగిస్తూ.

"ఇన్నాళ్ళ మన ప్రేమను యిలా మొగ్గలోనే తుంచివేయాలంటే నాకు..నాకు"....

మాటలు రాక తడుముకున్నాడు రామం.

"సినిమా డైలాగులు చెప్పొద్దు" సరోజ అంది.

రోషంతో బుసలు కొట్టాడు రామం

"తెలిసీ తెలియని వయస్సులో యేం జరిగినా" అదే నిజమైన ప్రేమ. అదే అమరప్రేమ వగైరా వగైరా అంటారు. నిజానికి ఇన్‌ఫాట్యూయేషన్ వేరు. ప్రేమ వేరు. ఎవరో మహానుభావుడు అప్పటికీ అన్నాడు కూడా. నిజమైన ప్రేమ నలభైయేళ్ళ వయస్సులో ఉద్భవిస్తుందని...." సరోజ చెప్పబోయింది.

"ఇప్పుడెందుకీ సోదంతా" విసుగ్గా అన్నాడు, రామం.

"మరీ చైల్డిష్‌గా మాట్లాడొద్దు రామం. నిజమే నువ్వన్నట్లే యింతకాలంగా ప్రేమించుకున్నాం. సో. వాట్. జీవితాంతం ప్రేమించుకుంటూనే వుండిపోవాలంటే యిది యాస్‌మన్ కలర్ తెలుగు సినిమాకాదు. జీవితం. యు నో ది సీజ్ రియల్ లైఫ్."

"నో డౌట్, నువ్వు పెద్ద లక్షాధికారి బిడ్డవూకాదు. నేనూ మరో పెద్ద బిజినెస్ మాగ్నెట్ కూతుర్నికాదు. ఆ ఫ్టాప్రిల్. దేశంలోని కోటానుకోట్ల మిడిల్ క్లాస్ బ్రతుకుల్లో మన బ్రతుకులూ ఒకటి."

"బియ్యే అవ్వాలన్నావు— అయింది. ఉద్యోగం రానీ అన్నావు— రాలేదు. అసలు వస్తుందన్నదికూడా అనుమానమే.

అటువంటప్పుడు నీకుద్యోగం వచ్చేదాకా—

చంద్రుడికోసం యెదురుచూసే చకోర్ధంలా—

స్వాతి జల్లుకోసం యెదురుచూసే ముత్యపు చిప్పలా—

యింకా యేదో యేదోలా- యెదురు చూస్తూ కూర్చోవటానికి నేను తెలుగు సినిమా హీరోయిన్నికాదు, నువ్వు హీరోవీ కాదు, కాబట్టి...."

"కాబట్టి .... ఆ రెండోపెళ్ళివాణ్ణి చేసుకుంటానంటావు. అంతేనా? వాడి కారు చూసి. వాడి బంగళాచూసి, వాడికున్న ఆస్తిచూసి, రెండో పెళ్ళవుతేనేం. మూడోపెళ్ళి వాడవుతేనేం, ముసలాడైతేనేం, చావబోతున్న వాడవుతేనేం కట్టుకుంటే పోలా.... వాడు చచ్చింతర్వాత, హాయిగా.. ."

"షటప్. పిచ్చిగా వాగకు" అసహనంగా అరిచింది సరోజ.

గాలి వేగం హెచ్చింది. వెన్నెల చిక్కబడుతోంది క్షణక్షణానికీ. సిటీ రంగు రంగుల లైట్లతో వింత వింత అందాలి సింగారించుకుని వెలిగిపోతోంది. వెన్నెల



కాంతిలో మరింత అందంగా మెరిసిపోతోంది సముద్రం. బీచ్‌లోని జనం క్రమక్రమంగా పల్చబడుతున్నారు.

నిశ్శబ్దం రాజ్యమేలింది వారి మధ్య

"ప్రేమ వేరు, జీవితం వేరు ప్రేమించుకున్నాం - ఆల్‌రైట్ అందులో తప్పు లేదు. అయితే ప్రేమించుకున్న పాపానికి నీ పరిస్థితులు చక్కబడేంత వరకు ఆగాలంటే"—

"నీ కుద్యోగం రావాలని నువ్వాగమన్నావు"—

"నీ కుద్యోగం వచ్చాక. నా కేదైనా రోగమొస్తే"—

"ఇలా ఒకటి తర్వాత ఒకటి పరిస్థితులంటూ వస్తూనే వుంటాయి. వాటికి తెంపి వుండదు. కాని ఈ పరిస్థితుల మధ్య జీవితాలను బలిచేసుకోవటం నా కిష్టం లేదు. నిన్ను ప్రేమించాను. అందుకు సందేహం లేదు. ప్రేమించాను ప్రేమిస్తున్నాను. ఇంకా ఇంకా ప్రేమిస్తా... కాని ప్రేమ గుడ్డిది కాకూడదు. ఐ వాంట్ లైకిట్."

రామం మౌనంగా వింటున్నాడు. చంద్రుడికేసి చూస్తూ.

"చట్టం కంటే అవసరం గొప్పది. బలమైంది కూడా. ఇప్పుడీ పెళ్ళి నా అవసరం కోసం కాదు. ఈ పెళ్ళితో నా యిద్దరన్నయ్యలకూ ఓ ఆధారం దొరుకుతుంది ఆయన ప్రాపకంతో. అది చాలు. ఇన్నాళ్ళూ గానుగెద్దులా నడుపుకుంటూ వచ్చిన మా నాన్నకు యింకా గుదిబండలా వుండలేను. ఈ గుడ్డి ప్రేమను నమ్ముకుని" సరోజ కంఠం గద్గదికమైంది.

"గుడ్డిప్రేమా." వెలవెలాబోతూ అడిగాడు రామం.




సరోజ కంట్రోల్ చేసుకుంది ఏమో షన్ని... "ఏమైనా అనుకో. ఐ వాంట్ కేర్. అంతకంటే విపులంగా నీకు చెప్పలేను." సరోజ లేచి నిల్చుంది.

రామం కూర్చునే అడిగాడు. "అయితే యిన్నాళ్ళ...."

"ఫర్‌గెటిట్. పాస్ట్ యీజ్ ఎ కాన్సిల్డ్ చెక్. యు కాన్ట్ కాషిట్. భవిష్యత్తులో బాగుపడాలనుకునేవాడికి, భూతకాలం గురించి ఆలోచన వుండకూడదు. "ప్రేమ ప్రేమ.... వల్లకాడు అంటున్నావు. అదంతా అసి సముద్రంలో గిరవాటేసి చక్కా దులుపుకుని. యింటికి వెళ్ళు" సరోజ కదలబోయింది.

రామం లేచాడు. అల్లకల్లోలమై పోయిందతని మనస్సు. "ఇది" అంటూ ప్రత్యేకంగా చెప్పలేని సందిగ్ధలో వూగిసలాడుతోందతని మనస్సు

"ఇంత నిర్దయగా నువ్వెలా అనగలుగుతున్నావ్ సరూ?" గొంతు పెకలించుకుని అడిగాడు.

చటుక్కున తిరిగింది సరోజ. ఆమె ముఖంలో ఆ క్షణంలో కదులాడిన భావాల్ని చదవలేక పోయాడు రామం.

"కష్టపడి వండుకున్న అన్నాన్ని పారవేసుకోవాలని యే మూర్ఖుడూ అనుకోడు రామం. నేను ముందే చెప్పాను. నువ్విప్పుడు పడుతున్న క్షోభకంటే వెయ్యి రెట్లెక్కువ క్షోభను నేననుభవించాను నీకీ మాట చెప్పడానికి- అర్థంచేసుకో" వెనుదిరిగింది సరోజ.

రామం రోషంతో బుసలు కొట్టాడు. "ఇంతకూ, నిన్నాడుకోబోతున్న హీరో యెవడు?" వ్యంగ్యంగా అడిగాడు.

సరోజ ఆగింది. అయితే వెనక్కు తిరిగి రామంకేసి చూడలేదు. "అతను హీరో కాదు. అలా అని విలనూ కాదు. మొదటి భార్య చనిపోయింది. అందుకే నన్ను చేసుకోబోతున్నాడు. నువ్వన్నట్లు కారుంది. బంగళావుంది. ఇంకేముందో నాకు తెలియదు. వెయిట్ ఫర్ వెడ్డింగ్ కార్డ్" అనేసి చకచకా వెళ్ళిపోయింది సరోజ.

ఒంటరిగా, ఆ వెన్నెల్లో నిలబడి పోయాడు రామం.

* * *

"రామం.!"

వెనక్కు తిరిగాడు రామం

సరోజ!

"నువ్వా.... ఐమీన్ మీరా" ఆశ్చర్యంగా అన్నాడు రామం.

"బహువచనం అక్కర్లేదు. ముందు మాట్లాడకుండా నా వెనక రా. నీకో సర్‌ప్రైజ్ యివ్వాలి" హోటల్లోకి దారి

రామం మాట్లాడకుండా నడిచాడు. నడుస్తూనే ఆమెను గమనించాడు.

మెడలో మంగళసూత్రం కనిపించటం లేదు

"ఇంకా కాలేదు కాబోలు" అనుకున్నాడు.

ఫామిలీ స్పేస్‌లోకి దారి తీసిందామె కూర్చున్నారు యిద్దరూ.

"ఏమైంది నీ మేరేజ్?" అడుగుతున్నాయి రామం చూపులు అర్థం చేసుకుందామె నవ్వింది.

"సర్‌ప్రైజ్ యిస్తానన్నాను కదూ. యిదే సర్‌ప్రైజ్."

రామానికర్థం కాలేదు.

అయోమయంగా చూశాడు. చేతిలోని ఫైలును ప్రక్కన పెడుతూ.

"ఒక్కోసారి మనం ఒక్కటనుకుంటాం రామం. కాని జరిగిందింకొకటి" ఆగింది సరోజ

రామం మౌనంగా వింటున్నాడు.

"నీకో కథ చెప్పనా?" సరోజ అంది.

రామం తలాడించాడు.

"ఓ వేటగాడుండేవాడు. వాడో నాడు ఓ తాబేలును పట్టుకుని చెరువుగట్టు మీద నుంచి వస్తుంటే, దూరంగా చచ్చినట్లు పడివున్న ఓ జింక కనిపించింది...."

"ఏం కావాలి సార్" వచ్చాడు సర్వర్.

ఆర్డరిచ్చింది సరోజ

సర్వర్ వెళ్ళిపోయాడు.

"ఎక్కడున్నాం?" సరోజ అడిగింది.

"జింక దగ్గర."

"ఆ, ఆ జింక మీద కూర్చుని ఓ కాకి ముక్కుతో పొడుస్తుంది, దాన్ని చూసి వేటగాడు తాబేలును భుజం మీద నుంచి క్రిందకు దించి గట్టుమీద పెట్టి, జింక కోసం వెళ్ళాడు. కొంచెం దూరం వెళ్ళేసరికి....

"ఇడ్లీ లేదు మేడమ్" వచ్చాడు సర్వర్.

"పోనీదోసె పట్రా" ఆర్డరిచ్చిందిసరోజ.

సర్వర్ వెళ్ళిపోయాడు.

"కొంచెం దూరం వెళ్ళేసరికి చచ్చినటు నటిస్తున్న జింక కాస్తా లేచి పారిపోయింది. 'అయ్యో' అనుకుని వెనక్కువెళ్ళి చూస్తే గట్టుమీద పెట్టిన తాబేలు కాస్తా చెరువులోకి పారిపోయింది" కథ ముగించింది సరోజ.

రామం మౌనంగా వింటున్నాడు సరోజకేసి చూస్తూ.

"మాట్లాడకూడదని వ్రతం ఏమన్నా పట్టావేమిటి?" అడిగింది సరోజ.

గట్టిగా నిట్టూర్చి. "నువ్విప్పుడా కథ చెప్పాల్సిన అవసరమేమొచ్చిందా అని ఆలోచిస్తున్నా...." అని ఒక్కక్షణం ఆగి, "బై దిబై.... నీ మారేజేమయింది?" అడిగాడు వ్యంగ్యంగా.

సరోజ నవ్వింది చిన్నగా.

సర్వర్ టిఫిన్ పెట్టి వెళ్ళిపోయాడు.

"నాకు జాబ్ దొరికింది" చటుక్కున అంది సరోజ ఫైలు కేసి చూస్తున్నవాడల్లా కనుబొమ్మలెగరేసి చూశాడు సరోజకేసి.

"నమ్మవు కదూ నాకేకాదు. మా అన్నయ్యలిద్దరికీ జాబ్స్ దొరికాయి" కళ్ళు మూసుకుని రిలీఫ్ పొందుతున్నట్లు అంది సరోజ

"నిజం??" నమ్మలేనట్లు అడిగాడు రామం.

"నిజం."

"మరి మరి" మాటలకోసం తడుముకున్నాడు రామం.

"ముందుకానీ."

టిఫిన్ కానిచ్చారు.

"మారేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్" అని ఎవరన్నారో కాని అక్షరాలా నిజం."

రామం అయోమయంగా చూశాడు.

సరోజ నవ్వింది చిన్నగా. "ఏమి తెలీనటు అలా చూడొద్దు. నాకు ఒళ్ళుమంట. ప్రేమా లేదు, దోమా లేదు అనుకున్నా కానీ అన్నీ వున్నాయి నిన్నొదులుకోలేను."

రామానికి అర్థమయింది. కాని ఓ చిక్కు ప్రశ్న వుండిపోయింది.

"మరి... మరి అతను.... అతను...."

మాటలు పెగలటంలేదు రామానికి.

ఫక్కున నవ్వింది సరోజ. "పరిస్థితులు అనుకూలంగా వున్నప్పుడు చూస్తూ చూస్తూ రెండో పెళ్ళివాణ్ణి చేసుకునేంత మూర్ఖురాల్ని కాదు నేను."

రామానికంతా అయోమయంగా వుంది.

"పైగా నేను ఎవరెవరితోనో తిరుగుతుంటానంట. మానర్‌లెస్ బ్రూట్ - ఇంకా యేవేవో వాగాడు."

రామానికర్థమయింది.

"రామం. ఏమంటావిప్పుడు? ఎలా వుంది నేనిచ్చిన సర్‌ప్రైజ్?"

"నేనూ నీకో సర్‌ప్రైజిస్తాను" రామం అన్నాడు తేరుకుంటూ.

ఈసారి అయోమయమైపోవటం సరోజవంతయింది.

"ఎల్లుండే నా మారేజ్. కాబోయే మామగారే వుద్యోగం యిప్పిస్తారట. పోతే పిల్ల.... ఐమీన్ నా భార్య నీ అంత అందంగా వుండదు. పైగా కుంటిది. అయితేనేం నా పరిస్థితులలాంటివి. ఇదుగో వెడ్డింగ్ కార్డ్." ఫైల్లోంచి శుభలేఖ తీసి సరోజ కందించాడు రామం. ●


అశేషాంధ్రుల, విశేషాభిమానాన్ని చూరగొంటున్న హైందవి సీరియల్
ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి రచన
మాదిరెడ్డి సులోచన రచన కలహంస సీరియల్
* *
విభిన్న భాషల, విభిన్న సంస్కృతుల సాహితీ వృక్షఛాయలు!
అధిక జనాదరణ పొందిన ప్రఖ్యాత నవలలు పొరుగువారి నవలలు
మూసిన తలుపులు (ఈనెల సంక్షిప్త నవల)
ప్రముఖ పంజాబీ రచయిత్రి 'అమృతాప్రీతం' నవల
ఈనెల తెలుగువారి నవల! దిక్కు(కొం)లో గులాబీ తోట - రచన ద్విభాష్యం రాజేశ్వరరావు
సచిత్ర మాస పత్రిక